ఈ-పేపర్ తెలుగు డైలీ 8PM

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/


బుధవారం, జూన్ 10, 2026

# అంబర్‌పేట్ శంకరన్నపై బంజారాహిల్స్ పీఎస్‌ల కేసు ఫైల్!



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 10:** అంబర్‌పేట్ శంకర్‌అన్నకు గట్టి షాకే తగిలింది. రియల్ ఎస్టేట్ బిజినెస్‌ల ఓ బిల్డర్‌ను బెదిరించిన ఆరోపణల మీద ఆయనతో పాటు మరికొంతమంది మీద బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోషల్ మీడియా నడుస్తున్న ప్రచారం ప్రకారం.. రియల్ ఎస్టేట్ ధందాలో ఏదో పంచాయితీ నడుస్తుండగా, అంబర్‌పేట్ శంకర్ పహిల్వాన్ ఈ మ్యాటర్‌ల ఎంటరైండ్రట. సదరు వ్యక్తి బిల్డర్‌ను పిలిపించి సెటిల్‌చేసుకోవాలని ప్రెజర్ పెట్టినట్లు, ఒకవేళ మాట వినకుంటే నీ ఫ్యామిలీని మొత్తం లేపేస్తామంటూ గట్టిగనే బెదిరించినట్లు సోషల్ మీడియాలో టాక్ నడుస్తోంది. బాధితుడు ప్రాణభయంతోని బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుడి కంప్లైంట్ తీసుకున్న పోలీసులు శంకర్‌అన్నతో పాటు ఇంకొంతమంది మీద కేసులు బుక్ చేశారు.

కాగా..ఇప్పుడు ఈ బెదిరింపుల కేసు బయటపడడంతో అటు పొలిటికల్ సర్కిళ్లల్ల, ఇటు రియల్ ఎస్టేట్ రంగంలో ఈ ముచ్చట పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. అయితే, ఈ కేసుకు సంబంధించి అసలు ఏం జరిగిందంటే, పోలీసుల దర్యాప్తులో ఇంకా బయటకు రావాల్సి ఉంది.

ఇక‘నో ఫ్రెండ్లీ పోలీసింగ్.. డీజీపీ సీవీ ఆనంద్ కీలక కామెంట్స్ 2



ప్రధానిగా మోదీ సరికొత్త రికార్డు.. అభినందనగా కేంద్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానం 2



ఎద్దు స్థానంలో భార్యను కాడికి కట్టి పొలం దున్ని!.. గుండెల్ని పిండేసే అన్నదాత దీనస్థితి.. 3



లేడీ పిల్లి కోసం ఎలుకను తెస్తే.. వేరే పిల్లితో సరసాలు.. .! 3


- నిన్న పొద్దుగూకినంక దంచికొట్టిన ఫస్ట్ వాన...!
- రోడ్లన్నీ చెరువులే.. ఎక్కడికక్కడ ట్రాఫిక్ కు బ్రేకులే!
- కరెంట్ కష్టాలు..రోడ్లపై పడ్డ చెట్లు.. మునిగి తేలిన బస్తీలు.!
- ఇప్పుడే ఇట్లుంటే... రేపు రేపు ఎట్ల...!
- సార్ల ముందస్తు చర్యల ముచ్చట్లు పేపర్లకేనా..?



అంబర్‌పేట ప్రధాన రహదారిపై వరద నీరు

# అర్ధగంట వానకే అంబర్‌పేట ఆగమాగం..!



నేల కొరిగిన చెట్లు

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 10:** ఈ సారి ఎండలు ఎట్ల మండిపోయినయో.. వానలు కూడా అట్లే దంచుతయని వాతావరణ శాఖ చెప్పిన ముచ్చట నిజమయ్యేటట్లు ఉంది. నిన్న పొద్దుమీకి (మంగళవారం సాయంత్రం) పడ్డ వానా కాలం ఫస్ట్ వానకే అంబర్‌పేట ఏరియా అంతా ఆగమాగమైంది. ఉత్తగనే అట్లా వచ్చి ఇట్లా వెళ్లిన అర్ధగంట వానతోని రోడ్లన్నీ జలమయమైపోయినయ్. తలుచుకుంటేనే భయమేస్తోందని జనం వణికిపోతుంటే.. మరి మన మున్సిపల్ సార్లు చేసిన ‘ముందస్తు చర్యల ముచ్చట’ అంతంతేనా? అని బస్తీల జనం అడుగుతున్నరు.

**చౌరస్తాలన్నీ జామ్.. ఇండ్లల్లకి చేరిన వరద!**

మంగళవారం సాయంత్రం ఆకాశానికి చిల్లు పడ్డట్టు ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి అంబర్‌పేట వణికిపోయింది. ప్రధానంగా చే నెంబర్ చౌరస్తా, శ్రీ రమణ చౌరస్తా, అలీ కేఫ్ చౌరస్తా లాంటి మెయిన్ రోడ్ల మీద మోకాళ్లోతు నీళ్లు చేరినయ్. దీంతో ఎక్కడికక్కడ బండ్లు నిలిచిపోయి మేర ట్రాఫిక్ జామైంది. వాహనదారులు వానలో తడుస్తూనే నరకం చూశారు. గోల్నాక డివిజన్ లోని లోతట్టు ప్రాంతాల బస్తీలు మునిగి తేలినయ్. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో మురికినీరు, వరద నీరు ఇండ్లలోకి చేరి జనం నానా హైరానా పడ్డారు. రాత్రంతా నిద్రలేకుండా గడిపారు.

**జైస్వాల్ గార్డెన్‌లో విరిగిన పోల్స్.. రాత్రంతా కరెంట్ కట్ !**

వాన దెబ్బకు అంబర్ పేట నియోజకవర్గంలో చాలాచోట్ల నష్టం జరిగింది. గోల్నాక జైస్వాల్ గార్డెన్‌లో ఒక పెద్ద మల్లె చెట్టు విరిగి కరెంట్ వైర్ల మీద పడింది.. ఏకంగా నాలుగు కరెంట్ పోల్స్ విరిగి పడిపోయాయి. దీంతో ఆ ఏరియా అంతా రాత్రంతా చీకట్లోనే ఉండిపోయింది. ఇటు కాచిగూడ ఏరియాలో కూడా భారీ వర్షానికి పెద్ద పెద్ద వృక్షాలు రోడ్డుపై కూలిపోయాయి. దీనితో అటువైపుగా వెళ్లే దారులన్నీ బంద్ అయిపోయినయ్.

**సార్ల ముందస్తు ముచ్చట్లు పేపర్లకేనా..?**


వానాకాలం రాకముందే డ్రైనేజీలు సాఫ్ చేస్తాం, రోడ్లు బాగు చేస్తాం అని ఆఫీసర్లు చెప్పిన ముచ్చట్లు ముచ్చట్లుగానే మిగిలిపోయినయి. మొదటి వానకే అంబర్‌పేట ఈ రేంజ్‌లో మునిగిపోతే.. ముందు ఇంకెన్ని కష్టాలు చూడాల్సి వస్తుందోనని జనం తలలు పట్టుకుంటున్నరు. ఇప్పటికైనా అధికారులు నిద్రలేచి వానా కాలంలో ముంపు కష్టం రాకుండా చర్యలు చేపట్టాలని జనం డిమాండ్ చేస్తున్నరు.



సీపీఎల్ రోడ్డులో నిలిచి పోయిన వరద నీరు



జైస్వాల్ గార్డెన్లో విరిగి పడ్డ కరెంటు స్తంభం



శాంతినగర్‌లో ఇండ్లలోకి వరద నీరు




చంద్రశేఖర్ (38)



రామచందర్ (36)



మల్లేశ్ కుమార్(31)(ఫైల్ ఫోటోలు)

# అయ్యో నాయినా.. ఇంత కష్టం ఏ తండ్రికి రావొద్దు..!

- సంబురంగా బాసరకు పోయి.. శవలై వచ్చిండ్రు!
- అర్రాస్ పెంటల ముగ్గురు కొడుకులకు పక్కపక్కనే చితి..
- తలకొరివి పెట్టిన కన్నతండ్రి..!
- కాచిగూడ చప్పల్ బజార్ల గుండెలు పగిలే రోదనలు!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 10:**

“ఓ అమ్మా సరస్వతీ.. నీ దర్శనానికి వస్తే మా బిడ్డలను మింగేస్తవా తల్లీ.. ఒక్కసారి మా పిల్లలను మాకు అప్పగించవా..” అంటూ ఆ కన్నతండ్రి ఆకాశం వైపు ఏడుస్తుంటే, అక్కడ ఉన్నోళ్లందరి కండ్లల్ల నీళు ఆగలేదు. కండ్ల ముందే ఎదిగిన ముగ్గురు కొడుకులు గోదారమ్మ ఒడిలో కలిసిపోతుంటే.. ఆ కన్నతండ్రి గుండె పగిలిపోయింది. ఏ తండ్రికైనా కొడుకులు ముసలితనంలో ఆసరా కావాలి.. కానీ ఇక్కడ కాలం కలిసి రాక, ఆ ముగ్గురు కొడుకులకే ఆ కన్నతండ్రి చేతులారా తలకొరివి పెట్టాల్సి వచ్చింది. ఒకే ఇంట్లో.. పక్కపక్కనే మూడు చితులు కాలుతుంటే ఆ శ్మశానవాటిక కూడా కన్నీరు పెట్టింది.

**సంబురంగా పోయి.. శవలై వచ్చిండ్రు!**

హైదరాబాద్ కాచిగూడ చప్పల్ బజార్‌కు చెందిన ఓ కుటుంబం నిన్న మంగళవారం పొద్దున్నే ఎంతో సంబురంగా బాసర జ్ఞాన సరస్వతి అమ్మ వారి దర్శనం కోసం బయల్దేరింది. గుడికి పోయే ముందర గోదావరి పవిత్రస్నానం చేద్దామని కుటుంబ సభ్యులంతా కలిసి నది దగ్గరికి వెళ్లారు. కానీ, ఆ నది రూపంలో మృత్యువు పొంచి ఉందని వాళ్లకు తెల్వదు. నీళ్లలోకి దిగిన కొద్దిసేపటికే.. కుటుంబానికి ఆసరాగా ఉండాల్సిన ముగ్గురు అన్నదమ్ములు చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31) ఒక్కసారిగా నీళ్లలో మునిగిపోయి గల్లంతయ్యారు.

**మిన్నంటిన రోదనలు.. అంతక్రియల్లో కన్నీళ్ల వరద!**

ఒకే ఇంట్లో.. ఒకేసారి ముగ్గురు కొడుకులు చనిపోవడంతో కాచిగూడ చప్పల్ బజార్‌లో చీకట్లు అలుముకుంటున్నాయి. అంతిమయాత్ర సాగుతుంటే బస్తీ అంతా కన్నీరు మున్నీరైంది. ముగ్గురు అన్నదమ్ముల పాడెలు పక్కపక్కనే వెళ్తుంటే.. ఆ ఇండ్లల్లో ఉన్న చిన్న పిల్లలు ఏమీ తెల్వక అమాయకంగా చూస్తున్న తీరు అందరి గుండెలను పిండేసింది. ముగ్గురు కొడుకులకు పక్కపక్కనే చితులు పేర్చి, కన్నతండ్రే తలకొరివి పెడుతుంటే బంధువులు, స్థానికుల ఏడుపులతో ఆ ప్రాంతమంతా శోకసంద్రమైంది.

**రాజకీయ నాయకుల పరామర్శ..**

ఈ దారుణ సంఘటనపై స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఈ కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముగ్గురు యువకుల అకాల మరణంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకోగా.. ఆ దేవుడు ఆ కన్నవారికి కొండంత గుండె నిబ్బరాన్ని అందించి, చనిపోయిన అన్నదమ్ముల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రజలంతా దండాలు పెడుతూ ప్రార్థిస్తున్నారు.



చప్పల్ బజారులో మృతి చెందిన ముగ్గురు అన్నదమ్ముల కుటుంబసభ్యలను పరామర్శిస్తున్న మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ



# హిమాయత్‌నగర్‌ల వాన బీభత్సం..

**రంగంలోకి దిగిన మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్**

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 10:**

నిన్న సాయంత్రం దంచికొట్టిన వానకు, సుడిగాలికి హిమాయత్‌నగర్ డివిజన్‌లోని జైస్వాల్ లెన్, వైఎంసిఏ, స్ట్రీట్ నంబర్ 7, 18, ఆయిల్ సీడ్స్ కాలనీ, బషీర్‌బాగ్‌ల పెద్ద పెద్ద చెట్లు, కరెంట్ స్తంభాలు విరిగిపడి జనాలు గట్టిగనే ఇబ్బంది పడ్డారు. చాలా చోట్ల కరెంట్ బంద్ అయింది. మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ వెంటనే అలర్ట్ అయి, తన క్యాంప్ ఆఫీస్‌ల కంట్రోల్ రూమ్ పెట్టిండ్రు. జనాల నుండి వచ్చిన ప్రతి ఫోన్ కాల్‌ను తీసుకుంటూ ఆఫీసర్‌లతో మాట్లాడి రాత్రంతా పనులను నడిపించారు. ఇవాళ పొద్దున్నే ఆమె స్వయంగా బస్తీలల్ల తిరిగి, దెబ్బతిన్న కరెంట్ స్తంభాలను చూశారు. కరెంట్ ఆఫీసర్లతో మాట్లాడి చాలా తొందరగా కరెంట్ సరఫరాను మళ్లీ కుదుటపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి. రామన్ గౌడ్, శేఖర్, రాజేంద్రగౌడ్, మోసిన్, జగదీష్, సాయి, జైస్వాల్ పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు అని వెల్లడి**



**ఇయ్యాల్టి న్యూస్,హైదరాబాద్, జూన్ 10:**

తెలంగాణ చరిత్రలో ఒక సరికొత్త మైలురాయి లిఖించబడబోతోంది. హైదరాబాద్ ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లే ‘భారత్ ఫ్యూచర్ సిటీ’ కల సాకారమయ్యేందుకు తొలి అడుగు పడింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు సాయంత్రం అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ భవన ప్రారంభోత్సవం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. ఈ చారిత్రాత్మక సందర్భంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. “ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు. ఆధునిక భారతదేశానికి నూతన నగరంగా ఈ భారత్ ఫ్యూచర్ సిటీ నిలవబోతోంది” అని అత్యంత ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ఈ అథారిటీ భవనాన్ని కేవలం 6 నెలల రికార్డు సమయంలోనే నిర్మించి పూర్తి చేయడం విశేషం. దాదాపు రూ.20 కోట్ల వ్యయంతో, 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక భవనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రణాళిక, సాంకేతికత, సుస్థిర అభివృద్ధికి ఈ ఫ్యూచర్ సిటీ ఒక నిలువెత్తు ప్రతీకగా మారబోతోందని సీఎం వెల్లడించారు.

## సీఎం రేవంత్ రెడ్డిని ‘రౌడీ’ అనడం తగదు: కాంగ్రెస్ సీనియర్ లీడర్ మురళీకృష్ణ



**ఇయ్యాల్టి న్యూస్,అంబర్ పేట, జూన్ 10:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ‘రౌడీ’ అని అనడం అస్సలు బాలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మురళీకృష్ణ తప్పుపట్టారు. కేంద్రమంత్రి హోదాలో ఉండి ఇట్లా మాట్లాడడం ఆయన సంస్కారానికే వదిలేస్తున్నాం. రెండేళ్లకు పైగా కేంద్రమంత్రిగా ఉండి కూడా తెలంగాణకు నిధులు తేవడంలో కిషన్ రెడ్డి ఫెయిలయ్యారని, అటు కేంద్ర ప్రభుత్వం కూడా రైతుల పంటను కొనకుండా అన్యాయం చేస్తోందని అన్నారు. మన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రం కోసం రోజుకు 18 గంటలు కష్టపడుతున్నారని మురళీకృష్ణ అన్నారు. కేంద్రం నుండి నిధులు, ప్రాజెక్టుల పర్మిషన్ల కోసం 50 సార్లు ఢిల్లీకి పోయి, ప్రధానిని 5 సార్లు కలిసి పరిశీలించారు. ఈ సమావేశంలె కాంగ్రెస్ నాయకులు లాలయ్య గౌడ్, రాజేష్ లాల్ ఉన్నారు.



# అంబర్‌పేటల డ్రైనేజీ సమస్యలపై మాజీ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ సీరియస్

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 10:** అంబర్‌పేట డివిజన్‌లోని పలు బస్తీలలో డ్రైనేజీ సమస్యలు జరగడంతో.. స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ ఐ.విజయ్ కుమార్ గౌడ్ ఇవాళ రంగంలోకి దిగారు. డివిజన్ పరిధిలోని న్యూ పటేల్ నగర్, ప్రేమ్ నగర్ చింతచెట్టు లైన్, అలీకేఫ్ లాంటి ప్రాంతాలలో ఆయన కాలినడకన తిరుగుతూ డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. మురికినీరు రోడ్ల మీదికి వస్తుండడంతో బస్తీ జనాలు పడుతున్న ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. బస్తీలల్ల డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతున్న తీరును చూసిన విజయ్ కుమార్ గౌడ్.. వెంటనే జలమండలి మున్సిపల్ అధికారులను, సిబ్బందిని స్పాట్‌కు పిలిపించారు. డ్రైనేజీ లైన్లను ఇమ్మీడియట్‌గా క్లీన్ చేయించి, జనాలు ఇబ్బంది పడకుండా సమస్యను అక్కడికక్కడే పరిష్కరించేలా గట్టి చర్యలు తీసుకున్నారు. ఈ పర్యటనలో జలమండలి ఏఈ ప్రదీప్ కుమార్, సిబ్బంది రాజేష్‌తో పాటు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వంజరి ప్రకాష్, పాక నర్సింగ్, రంగు ఉదయ్ గౌడ్, అజార్, హేమలత, అన్నపూర్ణ, సంతోష్ చారి, వరుణ్ పాల్గొని, బస్తీ సభ్యులు పాల్గొన్నారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/

## మిశ్రమంగా ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 10:** భారతీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి మిక్స్‌డ్‌గా స్థిరపడ్డాయి. సెన్సెక్స్ స్వల్ప లాభాలతో ముగియగా.. నిఫ్టీ నష్టాల్లోకి జారుకుంది. ట్రేడింగ్ ఆరంభంలో లాభాలు కనిపించినప్పటికీ ద్వితీయార్థంలో మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, స్థిరాస్తి రంగాల షేర్లలో భారీగా లాభాల స్వీకరణ కనిపించింది. దీంతో మార్కెట్లు గరిష్ఠ స్థాయిల నుంచి వెనక్కి తగ్గాయి. చివరకు సెన్సెక్స్ 64.42 పాయింట్లు లాభపడి 73,983.18 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27.15 పాయింట్లు నష్టపోయి 23,214.95 వద్ద ముగిసింది. నిఫ్టీ షేర్లలో హిందాల్కో ఇండస్ట్రీస్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మీడియా, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ రియల్టీ రంగాలు నష్టాలు మూటగట్టుకున్నాయి. దీనితో పాటు మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ షేర్లపై విక్రయాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్-క్యాప్ సూచీ 1.49 శాతం, నిఫ్టీ స్మాల్-క్యాప్ సూచీ 1.33 శాతం చొప్పున పతనమై ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.







## ప్రధానిగా మోదీ సరికొత్త రికార్డు..

### అభినందనగా కేంద్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానం

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 10:**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. వరుసగా అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన ఎన్నికైన నేతగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రక ఘట్టం సందర్భంగా నేడు సమావేశమైన కేంద్ర కేబినెట్, ప్రధాని మోదీని అభినందిస్తూ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. కేబినెట్ సభ్యులంతా నిలబడి చప్పట్లతో ఆయనకు తమ గౌరవాన్ని తెలిపారు.ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.

ఎన్నికైన ప్రధానిగా ఆయన 4,399 రోజులు పూర్తిచేసుకుని, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమించారు.

1952లో దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి నెహ్రూ ప్రధానిగా ఉన్న కాలాన్ని ఈ పోలిక కోసం పరిగణనలోకి తీసుకున్నారు. 1947 నుంచి 1952 మధ్య నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వానికి నేతృత్వం వహించారు. మరోవైపు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 14 ఏళ్లకు పైగా పదవిలో ఉన్నప్పటికీ, ఆమె పాలన నిరంతరాయంగా సాగలేదు.

దీంతో వరుసగా మూడుసార్లు (2014, 2019, 2024) గెలిచి, నిరంతరాయంగా అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన నేతగా మోదీ నిలిచారు. ఈ చారిత్రక సందర్భాన్ని, అలాగే కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు జరుపుకోవడానికి ఢిల్లీలో ఎన్డీయే కీలక సమావేశం ఏర్పాటు చేసింది.




## రేపు ఢిల్లీలో కాంగ్రెస్ అత్యసవర సమావేశం..
# అజెండా ఇదేనా?

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 10:** ఢిల్లీ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బలు, తృణమూల్ కాంగ్రెస్‌లో చెలరేగిన అంతర్గత తిరుగుబాటు కలకలం రేపుతున్నాయి. మరోవైపు ఆపరేషన్ లోటస్ భయాల మధ్య కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. దేశంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం అత్యవసర సమావేశానికి పిలుపునిచ్చింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌లు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులందరూ గురువారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగే సమావేశానికి హాజరుకానున్నారు. వారందరినీ ఆహ్వానిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ లేఖలు రాశారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం జరగనుంది.జూన్ 8న జరిగిన ఇండియా కూటమి సమావేశంలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ఆ పరిణామాలు జరిగిన కొన్నిరోజులకే కాంగ్రెస్ ఈ అంతర్గత భేటీని నిర్వహించనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. లోక్‌సభలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రతిపక్షాలు ఐక్యంగా ఎదుర్కొని వీగిపోయేలా చేశాయి. ఆ విజయాన్ని గత సమావేశంలో ఖర్గే అభినందించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమికి ఎదురుదెబ్బలు తగిలాయి. వాటి నుంచి కోలుకుని, మోదీ ప్రభుత్వాన్ని గట్టిగా ఎదుర్కొనేందుకు సరికొత్త ప్రణాళికను ఖర్గే రేపటి సమావేశంలో రాష్ట్రాల నేతలకు వివరించనున్నట్లు సమాచారం.



## ఇక నో ఫ్రెండ్లీ పోలీసింగ్..

### డీజీపీ సీవీ ఆనంద్ కీలక కామెంట్స్

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 10:**
రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కఠిన నిర్ణయాలు తీసుకోనున్నట్లుగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ఇకపై రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అనే మాటకు తావులేదని, నేరగాళ్ల పట్ల ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ, పెరుగుతున్న సైబర్ నేరాలు, డ్రగ్స్ నిర్మూలన, పోలీస్ విభాగాల పునర్వ్యవస్థీకరణపై కీలక ప్రకటనలు చేశారు. తెలంగాణలో మావోయిజం పూర్తిగా అంతమొందిందని డీజీపీ ప్రకటించారు. మారుతున్న కాలం, అవసరాలకు అనుగుణంగా పోలీస్ వ్యవస్థలో మార్పులు చేస్తున్నట్లుగా తెలిపారు. ఇందులో భాగంగానే అటవీ ప్రాంతాల్లో పోరాడేందుకు ఏర్పాటైన ఎలైట్ ఫోర్స్ 'గ్రేహౌండ్స్' విభాగాన్ని పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు వెల్లడించారు. అందులోని సుమారు 1700 మంది సిబ్బందిని ప్రస్తుతం అత్యవసరంగా మారిన కొత్త విభాగాలైన సైబర్ క్రైమ్, నార్కోటిక్స్ వంటి విభాగాలకు బదిలీ చేస్తున్నట్లు డీజీపీ సీవీ ఆనందర్ పేర్కొన్నారు.యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ మహమ్మారిపై యుద్ధం ప్రకటిస్తున్నట్లు సీవీ ఆనంద్ తెలిపారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాలను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, డ్రగ్స్ నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేస్తామని హెచ్చరించారు.



## ప్రధాని మోదీకి మెలోనీ అభినందనలు..

### భారత్-ఇటలీ బంధానికి కొత్త ఊపు

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్10:**
భారతదేశ చరిత్రలోనే అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన 'ఎన్నికైన' నాయకుడిగా నరేంద్ర మోడీ సరికొత్త రికార్డు సృష్టించారు. కేంద్రంలో 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న ఆయన, ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. తద్వారా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ (ఎన్నికైన ప్రధానిగా 4,398 రోజులు) పేరిట ఉన్న రికార్డును మోడీ అధిగమించారు. ఈ చారిత్రాత్మక మైలురాయిని అందుకున్న ప్రధాని మోడీకి ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రత్యేక శు భాకాంక్షలు తెలిపారు. ఇటీవలే మే నెలలో ప్రధాని మోడీ ఇటలీలో పర్యటించిన విషయాన్ని మెలోనీ తన పోస్టులో గుర్తు చేసుకున్నారు. రోమ్‌లో జరిగిన సమావేశంలో ఇరు దేశాల బంధాన్ని 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం'స్థాయికి పెంచినట్లు ఆమె పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రజలకు సరికొత్త అవకాశాలు సృష్టించేందుకు, భవిష్యత్తును మరింత బలోపేతం చేసేందుకు కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో దారుణం..

### అనుమానంతో భార్యను కాల్చి చంపిన భర్త

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 10:**
హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త, ఆమెను తుపాకీతో కాల్చి చంపాడు. మల్కాజ్‌గిరి మారుతి నగర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అరుణ్ అనే వ్యక్తికి పదేళ్ల క్రితం ఓ మహిళతో వివాహమైంది. అయితే, వేధింపుల కారణంగా ఆమె విడిపోయి దూరంగా ఉంటోంది. అనంతరం ఆమె సొంత చెల్లెలైన ఉషారాణితో అరుణ్ సహజీవనం మొదలుపెట్టి, ఐదేళ్ల క్రితం యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి మారుతి నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు.

కొంతకాలంగా ఉషారాణి మరొకరితో ఫోన్‌లో చాటింగ్ చేస్తోందని అరుణ్ అనుమానించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉషారాణి కూడా భర్తకు దూరంగా ఉంటోంది.

తన నుంచి దూరంగా ఉండటంతో ఆమెపై పగ పెంచుకున్న అరుణ్, హత్యకు ప్లాన్ చేశాడు. మాట్లాడుకుందామని నమ్మించి ఇంటికి పిలిపించి, తుపాకీతో ఆమెపై కాల్పులు జరిపాడు.





బుల్లెట్ తగలడంతో ఉషారాణి అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు ఉపయోగించిన తుపాకీ అరుణ్‌కు ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## 2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగాలి


### - బండి సంజయ్

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 10:**
భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొనియాడారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం భారత దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన అరుదైన రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని హర్షం వ్యక్తం చేశారు."రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. ఆయన తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## ఐటీ ఉద్యోగులు, విద్యార్థులకు గుడ్‌న్యూస్..
# లక్ష డాలర్ల హెచ్-1బీ పన్ను రద్దు!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 10:**
అమెరికాలో ఉద్యోగం చేయాలనే కలలతో ఉన్న లక్షలాది మంది భారతీయ విద్యార్థులు, ఐటీ నిపుణులు, యజమానులకు అమెరికా ఫెడరల్ కోర్టు శుభవార్త అందించింది. డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించిన వివాదాస్పద లక్ష డాలర్లు (సుమారు రూ. 84 లక్షలు) వార్షిక హెచ్-1బీ వీసా రుసుమును యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్ట్ జడ్జి లియో సోరోకిన్ చట్టవిరుద్ధమని పేర్కొంటూ కొట్టివేశారు. ఈ తీర్పుతో అమెరికాలో స్థిరపడాలనుకునే అంతర్జాతీయ ప్రతిభావంతులు, ముఖ్యంగా భారతీయులు ఊపిరి పీల్చుకున్నారు.డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన విధానం ప్రకారం, ప్రతి హెచ్-1బీ కార్మికుడి కోసం




యజమానులు ఏటా లక్ష డాలర్ల భారీ రుసుమును అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 19న ఈ ప్రతిపాదన బయటకు రాగానే పరిశ్రమ వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. అయితే, అమెరికా పార్లమెంట్ కాంగ్రెస్ ఆమోదం లేకుండా ఇలాంటి భారీ రుసుమును విధించడం పన్ను వేయడంతో సమానమని, ఇది చట్టవిరుద్ధమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అమెరికా హెచ్-1బీ వీసాలలో 70 శాతానికి పైగా వాటా భారతీయులదే. అలాగే ప్రస్తుతం అమెరికా విశ్వవిద్యాలయాలలో 3,30,000 మందికి పైగా భారతీయ విద్యార్థులు చదువుతున్నారు.



## కుప్పకూలిన పాక్ ఆర్మీ హెలికాప్టర్..

### 21 మంది భద్రతా సిబ్బంది దుర్మరణం

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 10:** పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో తీవ్రస్థాయిలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు, ఘర్షణలు తారా స్థాయికి చేరిన నేపథ్యంలో పాకిస్తాన్ సైన్యానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ ప్రాంతంలో శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు వెళ్లిన పాక్ మిలిటరీ హెలికాప్టర్ వీ×-17 ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న 21 మంది పాకిస్తాన్ భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లుగా తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా పీవోకే పరిధిలోని ముజఫరాబాద్, మీర్‌పూర్ ప్రాంతాల్లో నిత్యావసర ధరల పెరుగుదల, పన్నుల విధింపునకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తీవ్రస్థాయిలో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో ఇప్పటికే పలువురు మరణించగా, వందలాది మంది గాయపడ్డారు.ఈ క్రమంలోనే పరిస్థితిని అదుపు చేయడానికి, భద్రతా బలగాలను తరలించడానికి రంగంలోకి దిగిన పాక్ ఆర్మీ హెలికాప్టర్, సాంకేతిక లోపం కారణంగా కూలిపోయినట్లుగా తెలుస్తోంది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో సామర్థ్యానికి మించి సిబ్బంది ఉన్నట్లుగా సమాచారం. ఈ ఘటనపై పాకిస్తాన్ సైనిక విభాగం (ISPR) విచారణకు ఆదేశించింది.

## పాకిస్తాన్‌పై మీర్పూరీ ముస్లింల తిరుగుబాటు..

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 10:** పాకిస్తాన్ అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో తమ హక్కుల కోసం నినదిస్తున్న స్థానిక ప్రజలను పాక్ ఆర్మీ ఊచకోత కోస్తోంది. పీఓకే అసెంబ్లీలో కాశ్మీరీ శరణార్థులకు రిజర్వేషన్లు కల్పిచడంపై స్థానికులు భగ్గుమన్నారు. ఇదే కాకుండా పాకిస్తాన్ తమ వనరుల్ని దోచుకుని పాక్ పంజాబ్ ప్రావిన్సుకు తరలిస్తుందని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పీఓకేలోని రావల్‌కోట్ ప్రాంతంలో మొదలైన ఈ తిరుగుబాటు ముజఫరాబాద్, మీర్పూర్, గిల్గిత్ బాల్టిస్తాన్ ప్రాంతాలకు విస్తరించింది. అయితే, పాకిస్తాన్‌కు గత కొన్నేళ్లుగా అండగా నిలుస్తున్న మీర్పూరి ముస్లింలు ఇప్పుడు ఆ దేశంపై తిరుగుబాటు చేస్తున్నారు. ముఖ్యంగా యూకేలో కాశ్మీర్ విషయంలో, భారత్‌కు వ్యతిరేకంగా కథనాన్ని నిడిపించడంలో ఈ మీర్పూరి ముస్లింలు కీలకంగా వ్యవహరించేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. పీఓకేలో తమ వారిపై చేస్తున్న దౌర్జన్యాలపై పాకిస్తాన్‌ను ప్రశ్నిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో యూకే వెళ్లి అక్కడే సెటిల్ అయిన ఈ మీర్పూరి ముస్లింలు అక్కడి రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారు. ఇప్పుడు, పాకిస్తాన్ దురాగతాలపై యూకే స్పందించేలా ఒత్తిడి తీసుకువస్తున్నారు. బ్రిటన్‌లో ఉన్న ముస్లింలలో ఈ మీర్పూరి ముస్లింలే 60-70 శాతం ఉంటారు. బ్రిటన్ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తివంతమైన కమ్యూనిటీగా మారారు. బ్రిటన్‌లో 50 ఎంపీ స్థానాల్లో వీరు డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉన్నారు.



ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/

## ఒకే వేదికపైకి చంద్రబాబు, రేవంత్.. పుట్టిన రోజు నాడు బాలయ్య కీలక ప్రకటన..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 10:** నేడు బాలకృష్ణ పుట్టిన రోజు. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు బాలయ్యకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. హీరోగా సినిమాలు చేస్తూనే రాజకీయాల్లో ఎమ్మెల్యేగా సేవలు అందిస్తూ మరోవైపు బసవతారకం హాస్పిటల్ ద్వారా క్యాన్సర్ రోగులకు ఉచితంగా చికిత్స అందిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అభినందనలు అందుకుం టున్నారు బాలయ్య. బాలకృష్ణ మాట్లాడుతూ.. జూన్ 22న బసవతారకం హాస్పిటల్ 25 ఏళ్ల వేడుకని హైదరాబాద్ హైటెక్స్ లో ఘనంగా నిర్వహించ బోతున్నాము. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఎంతోమంది సహకారంతో ఈ క్యాన్సర్ హాస్పిటల్ ని నడిపిస్తున్నాము. ఎంతోమంది రోగులకు చికిత్స అందిస్తున్నాము. అందుకే పాతికేళ్ల వేడుకను ఏం సాధించాం, సమాజానికి ఏం ఇచ్చాం, ఇంకా ఏమి చేయాలి అని నిర్వహిస్తున్నాము. ఆ వేడుకకు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అనుప్రియ పటేల్, ఏపీ, తెలంగాణ వైద్య శాఖ మంత్రులు హాజరు కాబోతున్నారు అని తెలిపారు.







## అందాల బాజా మోగించిన పూనమ్ బాజ్వా..

### ఫొటోలు అదుర్స్ అయ్యో

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 10:** పూనమ్ బాజ్వా ఇండస్ట్రీకి వచ్చి రెండు దశాబ్దాలు గడిచిపోయింది. 2005లో 'మొదటి సినిమా' అనే చిత్రం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైంది పూనమ్. తర్వాత ప్రేమంటే ఇంతే, బాస్, వేడుక, పరుగు చిత్రాల్లో పూనమ్ నటించింది. అయితే తెలుగులో హిట్స్ లేకపోవడం, అవకాశాలు రాకపోవడంతో తమిళ్, మలయాళంలోనే తర్వాత సినిమాలు చేసింది. చివరిగా 2022లో గురుమూర్తి అనే తమిళ చిత్రం చేసింది పూనమ్. ప్రస్తుతం సినిమాలకి దూరంగా ఉంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంది.



## నటి దుషార విజయన్ ఆసక్తికర వ్యాఖ్యలు

### - పారితోషికం కంటే నటనే ముఖ్యం!


**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 10:** కోలీవుడ్ యంగ్ బ్యూటీ దుషార విజయన్ ప్రస్తుతం 'మకుటం', 'జిడిఎన్' సినిమాల షూటింగులతో ఎక్కువగా ఉన్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సినిమా ఇండస్ట్రీ, టాలెంట్ మరియు పారితోషికంపైగా మాట్లాడారు. మోడలింగ్‌లో గ్లామర్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని, కానీ సినిమాలో మాత్రం టాలెంట్‌కే మొదటి స్థానం దక్కుతుందని దుషారా అన్నారు. కొంతమంది స్టార్ హీరోలు కేవలం గ్లామర్స్ హీరోయిన్లనే కోరుకున్నప్పటికీ, దర్శకులు తన టాలెంట్‌ను చూసి అవకాశాలు ఇస్తున్నారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.తాను డబ్బు కోసం సినిమాలు చేయడం లేదని, తనకు మంచి ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఉందని స్పష్టం చేశారు. ఒకవేళ సినిమాలు మానేసినా తన కుటుంబం తనను చూసుకోగలదని చెప్పారు.తనకు పారితోషికం కంటే నటనే ముఖ్యమని, డబ్బు అనేది కేవలం అదనపు బోనస్ మాత్రమేనని అన్నారు. ప్రస్తుతం తనకు అందుతున్న పారితోషికంతో తాను చాలా సంతృప్తిగా ఉందని దుషారా విజయన్ పేర్కొన్నారు.

## లేడీ పిల్లి కోసం ఎలుకను తెస్తే.. వేరే పిల్లితో సరసాలు.. .!



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 10:** ప్రియురాలి కోసం నోట కరుచుకుని ఎలుకను తీసుకొచ్చిన ఓ జింజర్ పిల్లికి ఊహించని షాక్ తగిలింది. అది చేరేసరికి తనకు నచ్చిన పిల్లి మరో పిల్లితో ప్రేమగా సరసాలు ఆడుతూ కనిపించింది. ఆ దృశ్యం చూసిన పిల్లి నిరాశగా వెనుదిరిగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "జాతులు వేరైనా.. ప్రేమ బాధ ఒకటే" అంటూ నెటిజన్లు ఫన్నీ కామెంట్లు చేస్తున్నారు. వేలాది వ్యూస్, లైకులు సాధించిన ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారింది.

## రాష్ట్రంలో దారుణం.. భర్తను నరుకుతూ సెల్ఫీ తీసుకున్న భార్య



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 10:** తమిళనాడులో సంచలనం రేపిన ఘటనలో, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి మరీ సెల్ఫీ తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అస్సాంకు చెందిన దంపతులు చెన్నైలో నివాసముంటారు. భర్తకు మత్తుమందు ఇచ్చి గొంతు కోసి హత్య విచారణ అనంతరం, శరీరాన్ని ముక్కలుగా చేసి సూట్‌కేసులో పెట్టి వివిధ ప్రాంతాల్లో పడేసినట్లు తేలింది. కేసును దాచిపెట్టేందుకు ప్రయత్నించారు, కాల్ డేటా, లొకేషన్ వివరాలు, ఇతర ఆధారాల ఆధారంగా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. భార్య ఫోన్‌లో లభించిన వీడియోలు, ఫోటోలు కీలక ఆధారాలుగా మారగా, కేసుపై పోలీసులు మారారు.

## చిన్న గ్యాప్.. మళ్ళీ బోల్డ్ ఫొటోలతో వచ్చేసిన అషురెడ్డి..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 10:** రెగ్యులర్‌గా బోల్డ్ ఫొటోలతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యే అషురెడ్డి ఇటీవల ఓ కేసు వివాదంలో ఉండటంతో సోషల్ మీడియాకు గ్యాప్ ఇచ్చింది. కొన్నాళ్ళు బోల్డ్ ఫోటోలకు గ్యాప్ ఇచ్చిన అషురెడ్డి తాజాగా తన అందాలు ఆరబోస్తూ మళ్ళీ గ్లామరస్ ఫొటోలతో వైరల్ అవుతుంది.



## ఎద్దు స్థానంలో భార్యను కాడికి కట్టి పొలం దున్ని!..

### గుండెల్ని పిండేసే అన్నదాత దీనస్థితి..

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 10:** మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా, డియోని తాలూకా బంబాలి గ్రామంలో దేశాన్నే కదిలించే ఒక హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. దేశానికి అన్నం పెట్టే రైతు కుటుంబం, సాగు కోసం పడుతున్న అవస్థలు చూసి స్థానికులు కన్నీరు పెడుతున్నారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండటంతో అందర్నీ కలచి వేస్తున్నాయి.

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పిడుగుపాటు కారణంగా, బంబాలి గ్రామానికి చెందిన పేద రైతు కాశీనాథ్ గైక్వాడ్‌కు చెందిన ఎద్దు మరణించింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై, పొలం పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో



జీవనాధారమైన ఎద్దు చనిపోవడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. మార్కెట్‌లో మరో ఎద్దును కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత ఆ పేద రైతుకు లేదు. అటు చూస్తే విత్తనాలు వేసే సమయం మించిపోతోంది. చేసేదేమీ లేక, ఆ అన్నదాత తన నాగలికి ఒక వైపు ఎద్దును.. మరోవైపు తన భార్యనే కాడికి ఎద్దులా కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. భర్తతో పాటు ఆ ఇల్లాలు కూడా ఎద్దు స్థానంలో నిలబడి నాగలిని ముందుకు లాగుతూ పొలాన్ని దున్నుతోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. ఈ దృశ్యాలు చూసైనా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు,సంబంధిత మంత్రులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. ప్రకృతి వైపరీత్యానికి గురైన ఆ రైతు కుటుంబాన్ని ప్రత్యేక సందర్భం కింద పరిగణించి, ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సహాయం, కొత్త ఎద్దును అందజేసి ఆదుకోవాలని మానవతావాదులు కోరుతున్నారు.

## మాట్లాడదామని ప్రియురాలిని నమ్మించి తీసుకెళ్లిన ప్రియుడు..చెరువు కట్టపైనే కత్తిపోట్లు..!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 10:** ఏపీ నెల్లూరు నగరంలో అనుమానం ఓ యువతి ప్రాణాన్ని బలితీసుకున్న ఘటన సంచలనం సృష్టించింది. కనుపర్తిపాడుకు చెందిన రేవతి, కడపకు చెందిన శ్రీకాంత్ గత ఆరేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. రేవతి మరో వ్యక్తితో మాట్లాడుతోందనే అనుమానంతో శ్రీకాంత్ ఆమెతో అక్కడ జరిగిన వాగ్వాదం సమయంలో ముందే తీసుకెళ్లిన కత్తితో రేవతిపై దాడి చేయగా, తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం శ్రీకాంత్ రక్తపు కత్తితోనే వేదయపాలెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రేవతి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జీజీహెచ్‌కు గుర్తించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.





## సగం చూపిస్తూ సుప్రీత అందాలు.. ఎంత క్యూట్‌గా ఉందో..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 10:** సురేఖావాణి కూతురు, నటి సుప్రీత తాజాగా ఇలా సగం చూపిస్తూ క్యూట్ ఫోజులతో అలరించింది




## దిగ్గజ దర్శకుడు భారతీరాజా కన్నుమూత..

### నివాళులర్పించిన తమిళనాడు సీఎం విజయ్

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 10:** కోలీవుడ్ చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. దిగ్గజ తమిళ చలనచిత్ర దర్శకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత భారతీరాజా (84) కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోవృద్ధాప్య సమస్యలు, శ్వాసకోశ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, చెన్నైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

ఇక భారతీరాజా మరణవార్త తెలుసుకున్న తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ఆయనకు ఘన నివాళులర్పించారు. చెన్నైలోని దర్శకుడి నివాసానికి చేరుకున్న సీఎం విజయ్, ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన గాఢ సానుభూతిని తెలియజేశారు. సీఎం విజయ్ అక్కడికి చేరుకున్న విజువల్స్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. సినిమా రంగాన్ని ఒక మలుపు తిప్పిన 'దర్శక శిఖరం' (ఇయక్కునర్ ఇమయం)గా భారతీరాజా గుర్తింపు తెచ్చుకున్నారు. 1977లో వచ్చిన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు') సినిమాతో ఆయన దర్శకుడిగా పరిచయమయ్యారు. అప్పట్లో నాలుగు గోడల స్టూడియోలకే పరిమితమైన చలనచిత్రాలను అవుట్‌డోర్ లోని పల్లెటూరి స్వచ్ఛమైన వాతావరణానికి తీసుకెళ్లి సరికొత్త ట్రెండ్‌ను సృష్టించిన ఘనత ఆయనది. తెలుగు చిత్రసీమతోనూ ఆయనకు విడదీయరాని అనుబంధం ఉంది. ఆయన దర్శకత్వం వహించిన క్లాసిక్ ప్రేమకథా చిత్రం 'సీతాకోకచిలుక' తెలుగులో ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డుతో పాటు నంది అవార్డును కూడా గెలుచుకుంది. భారత చలనచిత్ర రంగానికి చేసిన అద్భుత సేవలకుగానూ కేంద్ర ప్రభుత్వం ఈయన్ను 2004లో 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది. తన కెరీర్‌లో ఆయన మొత్తం 6 జాతీయ చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. ఆయన మరణం యావత్ సినీ లోకానికి తీరని లోటు



## పెళ్లైన 6 నెలలకే విడాకులు.. భరణంగా రూ.1.35 లక్షలు!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 10:** పూణేకు చెందిన ఓ ఉద్యోగి పెళ్లైన ఆరు నెలలకే మనస్పర్థల కారణంగా విడాకులు తీసుకున్నారు. భర్త నెలకు రూ.2.79 లక్షలు, భార్య రూ.1.41 లక్షలు సంపాదిస్తున్నప్పటికీ, వివాహానంతరం అలవాటైన జీవనశైలిని కొనసాగించేందుకు భరణం కావాలని భార్య కోర్టును ఆశ్రయించింది. కేసును విచారించిన కోర్టు, భర్త తన జీతంలో సగం అయిన నెలకు రూ.1.35 లక్షలు భరణంగా చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పు సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, ఉద్యోగం చేసే మహిళకు ఇంత భారీ మెయింటెనెన్స్ అవసరమా అనే అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అలిమనీ చట్టాలు, ఆర్థిక సమానత, ఆధునిక వివాహాల్లో బాధ్యతలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ON BEHALFOF RRR MEDIA PRIVATE LIMITED. 2-3-603/49A, PATELNAGAR, AMBERPET, HYDERABAD.TELNGANA 500013..
EDITOR:RAMAN RAJU RATHNA.RNI NO:TG/2024/1093, Email:ramannews9@gmail.com Phone:9949152838,7013794396